بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ    نَحْمَدُهٗ وَنُصَلِّی عَلٰی رَسُوْلِهِ الْکَرِيْمِ    وَعَلٰی عَبْدِهِ الْمَسِيْحِ الْمَوْعُوْدِ

**Summary of Friday Sermon Hadhrat Khalifatul Masih vth 09.09.2016 (Telugu)**

**ఎలాంటి సంకోచము లేకుండా తమ బోధనలోని చిన్న చిన్న భాగమును కూడ పాటించుము. ఐరోపాకు వచ్చినను మాకు ఇస్లామీయ బోధన గొప్పదనము గురించి ఎలాంటి సందేహము లేదని వారికి చెప్పగలరు. ఇదే విధముగా అమ్మాయిలు తమ వస్త్రధారణ, ముసుగు పట్ల జాగ్రత్త పడగలరు. తమ సభ్యత, సంస్కార విషయములో ఆరోపణకు అవకాశమివ్వకూడదు. లజ్నా విభాగము ఇటు వైపు ప్రత్యేక శ్రద్ధ వహించవలెను. ఇలాగే ఖుద్దాముల్ అహ్మదియ్యా విభాగము కూడ ఇటు వైపు ప్రత్యేక శ్రద్ధ చూపవలెను. అన్సార్ కూడ తమ బాధ్యతలను విస్మరించరాదు. సమస్త ఉపశాఖలు, జమాఅత్ వ్యవస్థ జమాఅత్ ఆచరణ లోపములను గమనించి తమ తమ శిక్షణ కార్యక్రమాలను నిర్వహించగలరు. ఇందుకు ఉత్తమోత్తమ ఫలితములను పొందుటకు ప్రయత్నించగలరు.**

*హజ్రత్ అమీరుల్ మొమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తాలా బినస్రిహిల్ అజీజ్ 09.09.2016 తేదీన బైతుస్సుబూహ్, ఫ్రంక్‌ఫర్ట్ - జర్మనీలో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశము*

తషహ్హుద్, తఅవ్వుజ్, తస్మియ, సూర ఫాతిహా పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ప్రసంగించిరి.

అల్లాహ్ తఆలా కృపానుసారము గత ఆదివారము జల్సా సాలానా జర్మనీ తన మూడు రోజుల పూర్తి కార్యక్రమాల తరువాత ముగిసినది. సేవకులందరు మన కృతజ్ఞతకు అర్హులు. అల్లాహ్ తఆలా వారికి మంచి ప్రతిఫలమివ్వుగాక! ఆ పని చేసిన వారందరికి నేను కూడ కృతజ్ఞతలు తెలుపుచున్నాను. భవిష్యత్తులో కూడ గతము కంటే ఎక్కువ సేవ చేయు అనుగ్రహము అల్లాహ్ తఆలా వారికి కల్పించుగాక!

సభ సమయములో ఇతరులపై పడిన ప్రభావమునకు చెందిన కొన్ని సంఘటనలను నేను ప్రవేశపెట్టెదను. బోస్నియా నుండి వచ్చిన ఒక అతిథి ఇబ్రాహీమ్ గారిట్లు తెలిపిరి. పవిత్ర ఖుర్ఆన్ బోధనను ఆచరించుచున్న అహ్మదియ్యతే నిజమైనది. ఖలీఫతుల్ మసీహ్ ఖుత్బాలు, ప్రసంగములు నన్ను అన్నిటికంటే ఎక్కువ ప్రభావితం చేసినవి. నా హృదయము అన్ని విధాలా సంతృప్తి చెందినది. కనుక నేను బైఅత్ చేసి అహ్మదియ్యత్‌లో చేరినాను. మీ ప్రేమపూర్వక వ్యవస్థ, శాంతి నన్ను ఎంతో ఆకట్టుకున్నది.

ఇరాక్ నివాసి అయిన ఒక మిత్రులు రియాజ్ గారిట్లు తెలిపిరి. జల్సా సాలానా దృశ్యము నా కొరకు ఎంతో ఆశ్చర్యకరమైనది. సోదరభావమునకు చెందిన ఈ వాతావరణము ప్రపంచవ్యాప్తముగా అహ్మదియ్యత్‌లో తప్ప మరెక్కడా కనిపించదు. నాకు నలు వైపుల ప్రేమ మాత్రమే కనిపించినది. ఖలీఫా ప్రసంగములు మనసులో గల ఆలోచనలను ప్రతిబించినవి. ఇస్లాం ఈ అందమైన చిత్రము ప్రపంచములో అహ్మదియ్యత్ తప్ప మరే వర్గము వద్ద కనిపించదని నేను ప్రమాణపూర్వకముగా చెప్పగలను. అందుకే అన్నిటిని స్వయంగా కనులతో చూచిన తరువాత నేను నా కుటుంబము అహ్మదియ్యత్‌ను స్వీకరించడానికి ఎలాంటి సంకోచము కలుగలేదు. తిరిగి వచ్చిన తరువాత మేము మా బంధువులకు చెప్పగా మీరు మమ్ములను ఎందుకు తమ వెంట తీసుకొని పోలేదని, ఈ విషయములన్నిటిని విని మేము కూడ అహ్మదియ్యత్‌లో చేరదలచినాము వారన్నారు.

మరో మిత్రులు సల్మాన్ గారిట్లు తెలిపినారు. జల్సా వాతావరణము నన్ను చాలా ప్రభావితము చేసినది. ఇంత క్రమశిక్షణ గల సభను నేను జీవితములో ఎన్నడు చూడలేదు. ప్రజల సద్గుణములు, వారి ప్రవర్తనలు ప్రేమపూర్వక వాతావరణము అనగా ఈ విషయమలన్నియు నేడు అహ్మదియ్యత్ తప్ప మరెక్కడా కనిపించదు. ఈ విషయములనే చూచి నేడు నేను అహ్మదియ్య జమాఅత్‌లో చేరుటను ప్రకటించుచున్నాను.

బోస్నియా మరో అతిథి బాయిరన్ గారిట్లు తెలిపిరి. నేను మొదటి సారి జల్సా సాలానాలో పాల్గొన్నాను. సన్మార్గముపై గల ఈ జమాఅత్ నిజమైనది. జల్సలో నేను వర్తమాన ఖలీఫా మాటలు వినగా వారి హస్తమున బైఅత్ చేయాలని నిర్ణయించుకున్నాను. కనుక బైఅత్ చేసి అహ్మదియ్య జమాఅత్‌లో చేరినాను.

బెల్జియమ్ నుండి వచ్చిన ఒక అతిథి ఘర్యు గారిట్లు తెలిపినారు. ఇదే ఇస్లాం ధర్మము, ఇస్లాం అహ్మదియ్యత్‌లో చేరాలని నేను మొత్తం ముస్లిములతో విజ్ఞప్తి చేయుచున్నాను. నేడు ఖలీఫా హస్తమున బైఅత్ చేయు విషయమును నేను నమ్మలేక పోవుచున్నాను. మహ్దీ అవతరించుదురని నేను 14 సం॥ల వయసు నుండి మౌల్వీలతో వింటున్నాను.

నా ఆ కోరిక నేడు పూర్తి అయినది. సర్వమును నేను నా కనులతో చూచినాను.

మెసిడోనియా నుండి వచ్చిన పత్రికాకారులైన ఒక క్రైస్తవ మిత్రులు ఇట్లనిరి. నా వయసు 52 సం॥లు. నేను నా జీవితములో ఇంత కట్టుదిట్టమైన సభను ఎన్నడు చూడలేదు. సభ ఏర్పాట్లలో ఇంగ్లాండ్‌లో లేదా ఇక్కడ కూడ నేను ఎలాంటి లోపము చూడలేదు. పత్రికాకారులు విమర్శ దృక్పథముతో చూస్తారు. కాని అహ్మదియ్యత్ అందము వారికి ప్రతి చోట ఒకే విధముగా కనిపించినది.

పత్రికాకారులైన ఒక అహ్మదియేతర ముస్లిం సీనాద్ గారిట్లు తెలిపిరి. జల్సా సాలానా ఏర్పాట్లతో నేను చాలా ప్రభావితమైనాను. ఇంత ఎక్కువ ప్రజలు యున్న చోటను మొదటి సారి నేను చూచినాను. అందరు నాగరికత గల వారే. ఎవరి ముఖములో కోపము లేదా ద్వేషము కనిపించలేదు. ఖలీఫా ప్రసంగములు చాలా శక్తివంతమైనవి. అవి అందరిని ప్రభావితం చేయుచుండెను. వారి ఉపన్యాసములు ప్రజల హృదయముల వరకు చేరుచుండెను. నా వెంట క్రైస్తవులైన మరో మిత్రులు కూడ వచ్చి యుండిరి. వారు సభ ఆరంభము నుండే ఎంతగా ప్రభావితమైనారనగా తెలుపుటకు పదములు లభించడం లేదు.

బోసిన్యా నుండి వచ్చిన ఒక మిత్రులు డా॥ ఆదిల్ ఇట్లనిరి. జల్సా మొత్తం ఏర్పాట్లు, కార్యక్రమాలు ఒక నూతన తరహాలో యుండెను. ఒక వైద్యునిగా నేను గత 25 సం॥ల నుండి వివిధ కార్యక్రమాలలో పాల్గొంటున్నాను. కాని ఇటువంటి ఏర్పాట్లు, క్రమశిక్షణ నాకు ఎక్కడ కనిపించలేదు. ఇస్లాం పునాది విధేయత, క్రమశిక్షణయే. ఇదే విషయము నాకిక్కడ జల్సాలో కనిపించినది.

మరో అతిథి దానియాల్ గారిట్లనిరి. వేలాది ఆధ్యాత్మిక మృతులకు జీవితము ప్రసాదించిన సభ ఇది. ఆయా ఆధ్యాత్మిక మృతులలో నేను కూడ ఒకన్ని. జల్సాలో పల్గొని నాకు కూడ ఒక నూతన ఆధ్యాత్మిక జీవితము లభించినది.

బోసిన్యా నుండి వచ్చిన ఒక అహ్మదియేతర స్నేహితులు ఇట్లనిరి. జల్సా మొత్తం ఏర్పాట్లతో నేను చాలా ప్రభావితమైనాను. ప్రతి ఏర్పాటు ఎంతో మంచిగా సరియైన రీతిలో యుండెను. ఏ ఒక్క ఏర్పాటు గురించి కూడ ఇందులో లోపము లేదా పొరపాటు యున్నదని అనలేము. ప్రతి సేవకుడు అతిథుల సేవలో నిమగ్నమై ప్రేమకు నిలయంగా కనిపించుచుండెను. బైఅత్ సమయమున ఒక ఆనంద అల, విచిత్రమైన భావన కలుగుచుండెను. పదములలో తెలుపడం కష్టము. ఒక ప్రత్యేక భావనను నా హృదయం భావించినది. బైఅత్ సమయమున నా రోమాలు బొడుసుకున్నవి. ఒక అయస్కాంత మైదానమైనట్లు కనిపించుచుండెను. అందరు ఒక భావన, ఆకర్షణలో చిక్కుకొనిరి. ఈ జల్సా నాకు ఒక స్వప్నము కంటే తక్కువ కాదు.

బల్గారియా నుండి కూడ 76 మందితో కూడిన చాలా పెద్ద బృందయు వచ్చెను. వైద్యులు, సైన్యములో విశ్రాంతి పొందిన గొప్ప అధికారులు, ఉపాధ్యాయులు, విద్యావంతులు కూడ అందులో యుండిరి. ఒక అతిథురాలు మెగ్దా గారిట్లనిరి. యూరప్ దేశములలో అనన్య సంఖ్యలో విదేశీ అతిథులు వచ్చినారు. స్థానిక ప్రజలు వారిని ద్వేషిస్తారు. ఒక అయోమయ స్థితి ఏర్పడుచున్నది. కాని ఖలీఫా గారు ఈ విషయములో చేసిన మార్గదర్శనము వలన శాంతి ఏర్పడుచున్నది. ఇది అన్ని వ్యాకుతలకు పరిష్కారము. ఇదే విధముగా స్త్రీల, పురుషుల హక్కులు, బాధ్యతల గురించి వారు సూచించిన విషయములతో నేను చాలా ప్రభావితమైనాను.

మాల్టా నుండి కూడ ఒక బృందము వచ్చియుండెను. అందులో ఒక డాక్టరు కూడ యుండిరి. ఇట్లనిరి. జల్సాలో పాల్గొనుట, వర్తమాన ఖలీఫా ప్రసంగములు ప్రత్యేకముగా రెండవ రోజు ముస్లిమేతరులతో చేసిన ప్రసంగము తరువాత నాకు నా ప్రశ్నల సమాధానము లబించినదని నేను చెప్పగలను. జిహాద్ వాస్తవికత గురించి అహ్మదియ్య జమాఅత్ తెలిపే విషయమును ఒక పుస్తకములో ప్రచురించి ముస్లిములతో చదివించవలెను. మాల్టా ప్రజలకు నేను బాగా ప్రచారము చేయుదును. అహ్మదియ్యత్ ప్రవేశపెట్టుచున్నదే నిజమైన ఇస్లాం అని నేను వారికి తెలిపెదను.

లాటూయ నుండి వచ్చిన ఒక న్యాయవాది ఆరూరడ్ గారిట్లనిరి. మొదటి సారి జల్సాలో పాల్గొనే అవకాశము లభించినది. నేను మీ కంటే ఎక్కువ ప్రేమించేవారిని, సహాయము చేసేవారిని నా జీవితములో చూడలేదు. జల్సా సాలానాలో పాల్గొనుట నాకు గర్వకారణము. తిరిగి వచ్చిన తరువాత నేను నా జీవితము గురించి మరల గ్రహింతును.

మరో అతిథురాలు టీనా గారిట్లనిరి. జల్సా సాలానా జర్మనీలో స్త్రీల ప్రసంగములో స్త్రీల హక్కులు, వారిపై హజ్రత్ ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఉపకారముల గురించి గల ప్రసంగము నన్ను ఎంతో ప్రభావితము చేసినది. ఇస్లాంలో స్త్రీకి ఎంతో ప్రాముఖ్యత గలదని నేనిప్పుడు చెప్పగలను.

అసలు సెనిగాల్ నివాసులై బెల్జియం నుండి వచ్చిన మరో అహ్మదియేతర అతిథి ఇట్లనిరి. ఇక్కడ చూచిన వ్యవస్థ నాకెక్కడ కనిపించలేదు. నేడు ఇస్లాం బోధనలను ఆచరించుచున్నది కేవలం అహ్మదియ్య జమాఅతే మాత్రమే కనిపించుచున్నది.

లెథూవీనియా నుండి వచ్చిన మరో అతిథురాలు ఇట్లనిరి. నేను ఈ రోజులలో ఇస్లాం గురించి ఎంతో నేర్చుకున్నాను. మానవ హక్కుల గురించి ఇస్లాం ఎంతో శ్రద్ధ చూపునని నాకు అంచనా కలిగినది. నేను తిరిగి పోయిన తరువాత ఇస్లాం అహ్మదియ్యత్ సందేశము అందింతును. సభలో పాల్గొని నేను నాలో ఎంతో మార్పును భావించుచున్నాను.

అకౌంటెంట్ అయిన మిస్టర్ అరాల్డు గారిట్లనిరి. జల్సా సాలానా నాలో ముస్లిముల ప్రేమను ఏర్పాటు చేసినది. ముస్లిములు యుద్ధమును కాక శాంతిని ఆశించుతారు. ఐ.ఎస్.ఐ.ఎస్. ఇస్లాం నిజమైన చిత్రమును చూపదు.

సభ రోజులలో మనము జల్సా శుభములతో ప్రయోజనము పొందుతాము. ఒక వైపు మన సంస్కరణ, ఇతరులకు సందేశమందించటకు కారకులగుదము. అదే విధముగా మన లోపములను కూడ గుర్తించుకోవలెను. ప్రతి సారి నేను అనేక లోపములను చెప్పవలసిన లేదా వాటిని ఎత్తి చూపవలసిన అవసరం లేదు. కాని లోపములు, పొరపాట్లు తప్పక యుండును. ఏ వ్యవస్థ కూడ సంపూర్ణము కాదు. మన లోపములను కప్పిపుచ్చినందుకు మనము అల్లాహ్ తఆలాకు కృతజ్ఞతలు తెలుపవలెను. మన లోపములను కూడ పరిశీలించుకోవలెను. నిర్వహకులు లోపములను, పొరపాట్లను విమర్శ చూపుతో చూడవలెను. ఎక్కడెక్కడ మన లోపములు యున్నవో వాటిని అన్వేషించుము. ఎరుపు పుస్తకము సిద్ధము చేయవలెను. అందులో తప్పిదములను నమోదు చేయవలెను. అనంతరం వాటిని దూరము చేయుటకు ప్రయత్నించవలెను. ఈ విధముగా మన వ్యవస్థ మెరుగు పడును. అఫ్సర్ జల్సా సాలానా అన్ని శాఖలను కలిపి తరువాత ఒక సమావేశము ఏర్పాటు చూసి ఏ ఏ శాఖలో లోపములు యున్నవో నమోదు చేసుకోవలెను. ఎక్కడ లోపములు కనిపించినా వెంటనే నమోదు చేసుకొని పరస్పరం అభిప్రాయముతో వాటిని మెరుగైన రీతిలో పరిష్కరించుటకు, వచ్చే సంవత్సరం మెరుగైన ఏర్పాట్ల కొరకు ప్రయత్నించవలెను. ప్రజల తరపున ఏదేని సవరణ లేదా శ్రద్ధ వహించవలసిన విషయము అందినచో వెంటనే విశాల దృక్పథముతో వ్యవహరించి ఆ ఫిర్యాదును దూరము చేయుటకు ఇక ముందు గట్టి ప్రణాళిక రూపొందించవలెను. అందరిని ఇందుకు అల్లాహ్ తఆలా అనుగ్రహించుగాక!

ఈ పర్యటనలో కొన్ని మస్జిదుల శంకుస్థాపన, ప్రారంభోత్సవము చేయుటకు నాకు అనుగ్రహము లభించినది. ఇది కూడ సందేశమునకు కారణమగును. ఇతర అతిథులు వచ్చి ఇస్లాం గురించి విషయములు సేకరింతురు. ఇస్లాం బోధన ఈ కోణము మాకెన్నడు చూపబడలేదని తమ ఆశ్చర్యమును వ్యక్తపరతురు. ఇప్పుడు దీని గురించి కూడ నేను కొన్ని అభిప్రాయములను ప్రవేశపెట్టెదను.

ఒక మస్జిద్ ప్రారంభోత్సవములో ఒక హిస్పానీ క్రైస్తవ ఇట్లనిరి. నా కుమారుడు కొన్ని సంవత్సరముల క్రితం అహ్మదీ అయినాడు. తద్వారా నాకు చాలా ఇబ్బంది కలిగినది. ఎందుకనగా నేనొక కేథలిక్ క్రైస్తవుడను, నా ధర్మమును గట్టిగా పాటింతును. నా కుమారుడు ఎక్కడికి చేరినాడని నాకు బాధ కలిగినది. ఇస్లాం నష్టపూరితమైనదని నేను భావింతును. నా కుమారుడు సరియైన స్థలమునకు చేరినాడని నాకిప్పుడు సంతోషము గలదు.

మరో అతిథురాలు కేరులా గారిట్లనిరి. నాకు కొంత విచారము కొంత బాధ కూడ కలిగినది. ఎందుకనగా ఇస్లాం శాంతియుత ధర్మమని మీ ఖలీఫా పదే పదే చెప్పవలసి వచ్చెను. కాని నేడు ఇస్లాంనకు వ్యతిరేకంగా చేయబడుచున్న ప్రచారము, ఇస్లాంనకు అంటగడుచున్న విషయముల వలన ప్రజలకు అర్థమయ్యేల పదే పదే ఈ విషయమును చెప్పుట అనివార్యమని నేను భావింతును. ఇస్లాం శాంతి సందేశమిచ్చునని వారెంతో సూక్ష్మ దృష్టితో ఈ విషయమును ప్రస్తావించినారు. వారేవిధముగా చెప్పినారనగా ఎవరు కూడ దానికి విరుద్ధమైన నిదర్శనము ఇవ్వలేరు. సందేశము ఎంతో నిరాడంబరంగా యున్నది. ప్రతి ఒక్కరు ఇతరులను ఆలింగనం చేసుకోవలెను. పరస్పరం ప్రేమానురాగముతో యుండవలెను. నాకు అహ్మదియ్య మస్జిద్‌తో ఎలాంటి ఇబ్బంది లేదు. కాని ఒక విచారము తప్పక గలదు. మస్జిద్, చర్చి స్థాయి ఒకటే. మస్జిద్ ముస్లిముల ప్రార్థనా స్థలము కాగా చర్చి క్రైస్తవుల ప్రార్థనా స్థలము. అయినను నగర కేంద్రములో చర్చిలను నిర్మించుటకు అనుమతి లభించగా మస్జిదులు నగర బయట నమాజ్ చదివే వారు దూరము రావలసి యుండును. నగరములో మస్జిద్ నిర్మించే అనుమతి ఎందుకు

లభించదు. ఇటువంటి వేడుకల వలన మస్జిదులకు వ్యతిరేకంగా యున్నవారిలో ఇప్పుడు మస్జిదులకు సహకరించేవారు ఏర్పడినారు. మస్జిదుల ప్రారంభోత్సవము వలన మన మస్జిదులు కూడ నగరములోనే నిర్మించవలెనను అభిప్రయాము కలుగుచున్నది.

ఒక చోట మేయర్ గారిట్లనిరి. మీ జమాఅతులు నాకు తెలుసని నాకు ఎంతో గర్వముండెను. కాని నేడు ఇస్లాం గురించియే కాక ఇస్లాం సానుభూతి పట్ల ప్రత్యేకంగా మీ భావములను చూచి మరింత నేర్చుకునే అవకాశము లభించినది. దీని గురించి నేను (అనగా హుజూర్) చెప్పిన విషయముల వలన నాకు చాలా సంతోషము కలిగినదని అనిరి. ఇస్లాం చర్చిల రక్షణ గురించి, ఇతర మతస్థుల రక్షణ గురించి బోధించునని ఖలీఫా గారు చెప్పినందున నాకు చాలా సంతోషము కలిగినది.

మరొక అతిథులు స్టీఫెన్ గారిట్లనిరి. నేడు నేను ఇస్లాం ప్రాథమిక సూత్రములను నేర్చుకొన్నాను.

మరో అతిథురాలు ఇట్లనిరి. ఖలీఫా సందేశము, ప్రసంగము విన్నాను. పొరుగువారి గురించి ఇంత గొప్ప బోధన ఎన్నడు వినలేదు. మీ ఖలీఫా గారు చెప్పినట్లు ప్రతి ఒక్కరు పొరుగువారి హక్కులను చెల్లించినచో ఈ ప్రపంచము శాంతియుతంగా మారును. తమ హక్కులను అడిగే బదులు ఇతరుల హక్కులను చెల్లించుమని ఖలీఫా గారనిరి. ఇదే శాంతికి పరిపూర్ణ బోధన అగును.

మరొక జర్మన్ పురుషుడు కాదు జర్మన్ మహిళ ఇట్లనిరి. స్త్రీ, పురుషులు పరస్పరం చేతులు కలిపే సమస్యను మీ ఖలీఫా ఎంతో వివరణతో చెప్పినందుకు విని నాకు ఆనందము కలిగినది. వారి ప్రసంగము వినుట నాకు గౌరవ కారణం. వారిచ్చిన నిదర్శనములను రద్దు ఎవరు చేయలేరు. శాంతియుత, సహనపూరిత సమాజములో ఒకరు మరొకరి విశ్వాసాలను మనము గౌరవించాలని వారు చెప్పినది వాస్తవమే.

హుజూర్ ఇట్లనిరి. మనము ఒక విషయమును గుర్తుంచుకోవలెను. ఇతరులతో మాట్లాడేటప్పుడు తమ ధర్మము, మతము, ఆచారములను సంభాషించినచో చాలా వివేకముతో మాట్లాడవలెను. తద్వారా మీ సందేశము కూడ వారికి అందును, ఇతరుల మనోభావాలను కూడ గాయపర్చరు.

బలవంతముగా మనము ఎవరిని ఒప్పించలేము. కాని తమ బోధన నుండి వెనుకడుగు కూడ వేయకూడదు. ఏ విషయములో కూడ, ధర్మము విషయములో మనము సిగ్గుపడాల్సిన అవసరం లేదు. మనము ప్రపంచమును ఇస్లాం పతాకము నీడన చేర్చదలచినచో మనము ప్రతి విషయములో ఆచరణాత్మక ఉదాహరణలను చూపవలెను. ధైర్యము కూడ ప్రదర్శించవలెను.

ఎలాంటి సంకోచము లేకుండా తమ బోధనలోని చిన్న చిన్న భాగమును కూడ పాటించుము. ఐరోపాకు వచ్చినను మాకు ఇస్లామీయ బోధన గొప్పదనము గురించి ఎలాంటి సందేహము లేదని వారికి చెప్పగలరు. ఇదే విధముగా అమ్మాయిలు తమ వస్త్రధారణ, ముసుగు పట్ల జాగ్రత్త పడగలరు. తమ సభ్యత, సంస్కార విషయములో ఆరోపణకు అవకాశమివ్వకూడదు. లజ్న విభాగము ఇటు వైపు ప్రత్యేక శ్రద్ధ వహించవలెను. ఇలాగే ఖుద్దాముల్ అహ్మదియ్య విభాగము కూడ ఇటు వైపు ప్రత్యేక శ్రద్ధ చూపవలెను. అన్సార్ కూడ తమ బాధ్యతలను విస్మరించరాదు. సమస్త ఉపశాఖలు, జమాఅత్ వ్యవస్థ జమాఅత్ ఆచరణ లోపములను గమనించి తమ తమ శిక్షణ కార్యక్రమాలను నిర్వహించగలరు. ఇందుకు ఉత్తమోత్తమ ఫలితములను పొందుటకు ప్రయత్నించగలరు. అల్లాహ్ తఆలా అందరిని ఇందుకు అనుగ్రహించుగాక! (ఆమీన్)

BOOK POST (PRINTED MATTER)

To,

..............................................................................

..............................................................................

..............................................................................